క్లుప్తంగా

స్వప్న హైందవికి మాతృదేవోభవ పురస్కారం



మాతృదేవోభవ పురస్కారం అందుకుంటున్న డాక్టర్ పి.స్వప్న హైందవి

విజయనగరం టౌన్: పలు రంగాల్లో విశేష సేవలందించిన జిల్లాకు చెందిన రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, సేవామూర్తి డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి ఏలూరులో శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా మాతృదేవోభవ పురస్కారం అందుకున్నారు. మహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణ మంటపంలో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ కత్తిమండ ప్రతాప్, డాక్టర్ టి.పార్థసారథి, కొల్లి రమావతి, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరానికి స్పందన



వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు

విజయనగరం ఫోర్ట్: నేత్ర వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని గ్రామీణ వైద్యుల సంఘ ప్రతినిధి ఐ. గోపాలరావు అన్నారు. గ్రామీణ వైద్యుల సంఘం, వైష్ణవ్ ఐకేర్, మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో కోరుకొండపాలెంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంటి సమస్యల పట్ల అలసత్వం పనికిరాదన్నారు. 100 మంది రోగులను పరీక్షించగా అందులో 28 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బోని కృష్ణ, మాతృభూమి సేవా సంఘ ప్రతినిధులు సిరపురపు సత్యారావు, ధనలక్ష్మణ్, రెడ్డి సత్యారావు, ఈశ్వరరావు, బంగారు నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి కల్యాణోత్సవాలు



యాగశాలలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి సన్నిధిలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపించారు. వేకువజామున ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తర్వాత యాగశాలలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠాపన, ఆదిత్య హృదయ హోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు చక్రతీర్థ స్నానం జరిపిస్తామని అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నరసింహస్వామి జయంత్యుత్సవం



నరసింహస్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ సుధారాణి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఎంబేరేయగుష్ట గ్రామంలో స్వయంభువుగా వెలిసిన అతి పురాతన ఎంబేర్‌మన్నార్ స్వామి దేవాలయంలో నరసింహస్వామి జయంత్యుత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్వామి సన్నిధిలో ప్రత్యేక హోమాలు జరిపించారు. సాయంత్రం స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫల రసాలతో అభిషేకాలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్‌కుమారాచార్యులు, శ్రీనివాసమూర్తి, సర్పంచ్ రేవళ్ల శ్రీనివాసరావు, స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అదనపు లోడు.. క్రమబద్ధీకరణకు అవకాశం..

- 50 శాతం రాయితీ కల్పిస్తున్న వైనం
- జూన్ 30 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి : విద్యుత్ శాఖాధికారులు



విద్యుత్ మీటర్

విజయనగరం: నగరానికి చెందిన రామకృష్ణ ఇంటి అవసరాల నిమిత్తం వినియోగించే విద్యుత్‌కు నెలకు రూ.800 వరకు బిల్లు వస్తుంది. వేసవిలో ఏసీ వాడకంతో లోడు పెరిగింది. దీంతో సాధారణ బిల్లుతో పాటు డవలప్‌మెంట్ చార్జీతో అదనపు బిల్లు వస్తోంది. ఇటువంటి సమస్యల పరిష్కారంలో భాగంగా అదనపు లోడు క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తోంది. క్రమబద్ధీకరించుకున్న వారికి అదనపు చార్జీల బెడద ఉండదని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా కనెక్షన్ ఇచ్చే సందర్భంలో కిలోవాట్ విద్యుత్ వినియోగానికి గృహాలకు రూ.2 వేలు, దుకాణాలకు రూ.2,500 వసూలు చేస్తారు. చాలామంది గృహ వినియోగదారులు ఈ మొత్తానికి సంబంధించి తమ వినియోగం 1 నుంచి 2 కిలోవాట్ లోపలే చూపిస్తారు. వినియోగంలో అంతకు రెట్టింపు క్యాటగిరీలో చేరిపోతున్నారు. వాణిజ్య కనెక్షన్లకు సంబంధించిన వినియోగమైతే చూపించిన దానికంటే ఏకంగా నాలుగింతలు ఉంటోంది.

జరిమానా బెడద ఉండదు

- ఇప్పటి వరకు అధిక లోడ్ నియంత్రణలో భాగంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది తరచూ ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేసేవారు. అధిక లోడ్ వినియోగిస్తున్న వారిని గుర్తించి రుసుముతో పాటు జరిమానా వసూలు చేసేవారు.
- పట్టణంలోని డీ1, డీ2, డీ3 ఉప విద్యుత్ కేంద్రాల పరిధిలో సుమారు రెండు లక్షల పైగా కనెక్షన్లు ఉన్నాయి. వీటి పరిధిలోని వినియోగదారుల్లో 50 శాతానికి మించి కనెక్షన్ తీసుకున్న సమయంలో చూపించిన వినియోగం కంటే అధికంగానే విద్యుత్ వాడుతున్నారు.
- గత ఐదేళ్లుగా ప్రతినెలా ఉప కేంద్రం పరిధిలో తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రీడింగ్‌లు తనిఖీ చేసి అధిక లోడు వినియోగిస్తున్న వారికి జరిమానా విధిస్తున్నారు.

తీరనున్న లోవోల్టేజీ సమస్య

- గృహాలు, దుకాణాలకు విద్యుత్ కనెక్షన్లు తీసుకునే సమయంలో దీపాలు, ఇతర గృహోపకరణాల వినియోగాన్ని సగటున అంచనా వేసి లోడ్‌ను కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డవలప్‌మెంట్ చార్జీలు వేస్తారు. అధిక శాతం మంది గృహాలకైతే 1- 2 కిలోవాట్లు, దుకాణాలకు 2-3 కిలోవాట్లకు మాత్రమే అనుమతి తీసుకుంటారు. ఈ లెక్క ప్రకారమే ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు.
- పట్టణీకరణ, ఇంట్లో అవసరాలు పెరగడం, దుకాణాలకు సంబంధించి వ్యాపార లావాదేవీలు పెరగడం, వాతావరణ పరిస్థితుల వల్ల అనుమతి తీసుకున్న దానికంటే అధికంగా విద్యుత్ వినియోగం ఉంటోంది.
- వినియోగం అంచనాకు మించడంతో నియంత్రికలపై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడం, లోవోల్టేజీ సమస్యలు పెరిగిపోతున్నాయి.

సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200

ప్రతి అదనపు కిలోవాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200 నిర్ణయించారు. ఇదే సమయంలో డవలప్‌మెంట్ చార్జీ రూ. 1500 ఉంటుంది. కిలోవాట్లు పెరిగే కొద్దీ ఈ రుసుం మారుతుంది. దరఖాస్తుల స్వీకరణ మార్చి 1న ప్రారంభమై జూన్ 30వ తేదీతో ముగుస్తుంది. కిలోవాట్ల చొప్పున డవలప్‌మెంట్ చార్జీల్లో 50 శాతం రాయితీ లభిస్తుంది.

స్వచ్ఛందంగా ముందుకు రావాలి

వినియోగదారులే స్వచ్ఛందంగా ముందుకొచ్చి అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలి. ఇలా చేసుకుంటే అదనపు రుసుములు, జరిమాన బెడద ఉండదు. లేనిపక్షంలో ఇబ్బందులు తప్పవు. – కిరణ్‌కుమార్, ట్రాన్స్‌కో ఏడీఈ

సైనికుల శక్తి,సామర్థ్యాలు పెరగాలి

- పైడితల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



పైడితల్లి ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

విజయనగరం: దేశ రక్షణలో కీలకమైన సైనికుల శక్తి సామర్థ్యాలు పెరగాలని ఆకాంక్షిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం స్థానిక పైడితల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 టెంకాయలు కొట్టారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ మాట్లాడుతూ.. ప్రాణాలకు తెగించి పోరాడుతున్న సైనిక బలగాలు క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో భవిష్యత్‌లో మరింత ప్రగతి సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ లక్ష్మీనరసింహం, పార్టీ మండల అధ్యక్షుడు సుధీర్, రాంబాబు, గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తల్లులను గౌరవించాలి

విజయనగరం గంటస్తంభం: తల్లి లేనిదే జన్మ లేదని.. అటువంటి తల్లిని గౌరవించడం విద్యార్థి దశ నుంచే పిల్లలకు నేర్పాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, జిల్లా సమత నాయకులు శశికళ, శాంతి అన్నారు. ఆదివారం తల్లుల దినోత్సవం సందర్భంగా విజయనగరం సుంకరి వీధిలో అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అడ్వకేట్ రమేష్‌రాజా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా మండలంలోని పలు గ్రామాలకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విజయనగరం ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మోపాడ, జగన్నాథపురం, వల్లూరు గ్రామాలకు పూర్తిగాను.. మోదవలసలో కొంతభాగం విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నామని విద్యుత్ శాఖ డీఈఈ పి. త్రినాథరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ లైన్లకు సంబంధించి చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ నేపథ్యంలో మధుపాడ, పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాలల వికాసమే ధ్యేయం



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రస్ట్ ప్రతినిధులు

పూసపాటిరేగ: బాలల వికాసమే సంస్థ ధ్యేయమని ముక్తిదాం క్షేత్రం ట్రస్టీ పోతినిండి అనంతబాబు అన్నారు. గోవిందపురం ముక్తిదాం క్షేత్రంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న జ్ఞానవికాస్ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఆధ్యాత్మికతపై కనీసం అవగాహన ఉండాలన్నారు. యోగా, సూర్య నమస్కారాలు, భగవద్గీత శ్లోకాలు పఠించడం, సంప్రదాయ విలువలు నేర్చుకోవడం, డ్రాయింగ్, క్రాఫ్ట్, తదితర అంశాలపై విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. అమ్మ పరివార్ సేవాభావంతో నిర్వహించిన కార్యక్రమంలో 160 మంది పిల్లలకు వారం రోజులు పాటు ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోతినిండి శ్రీనుబాబు, గంటా అప్పలనాయుడు, బాలా అప్పలరాజు, డి. ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ విక్రం జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

● సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత..



ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా మంజూరైన చెక్కును నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి లబ్ధిదారుకు ఆదివారం అందజేశారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని 15వ వార్డుకు చెందిన మహమ్మద్ షరీఫా బేగం ఇటీవల అనారోగ్యంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరారు. చికిత్స కోసం అయిన ఖర్చును మంజూరు చేయాలని ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. అలా మంజూరైన మొత్తం రూ. 30 వేలకు చెక్కును ఎమ్మెల్యే మాధవి బాధితురాలికి కుటుంబ సభ్యుల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో అప్పికొండ రవికుమార్, రవ్వా నాని, సిరిగుడి వాసు పాల్గొన్నారు. - నెల్లిమర్ల

● రూ. 25 వేల ఆర్థిక సాయం..



సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా హనుమాన్ జయంతి వారోత్సవాల నిర్వహణకు చిన్న శ్రీను సోల్జర్స్ అసోసియేషన్ తమ వంతు ఆర్థిక చేయూతనందించింది. నగరంలోని బొంకులదిబ్బ ప్రాంతంలో గల విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించే ఉత్సవాలకు అసోసియేషన్ అధ్యక్షురాలు రూ.25 వేల నగదును నిర్వాహకులకు ఆదివారం అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. భావితరాలకు మన సంప్రదాయాలు, ఔన్నిత్యాన్ని చాటిచెప్పేందుకు ఇటువంటి ఉత్సవాలు ఎంతగానో దోహదపడతామని సిరిసహస్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు. - విజయనగరం

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



1991 - 92 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు



1985 - 86 బ్యాచ్ విద్యార్థులు

విజయనగరం టౌన్/విజయనగరం: కంటోన్మెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 1991-92 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు కామాక్షినగర్‌లో ఉన్న కల్యాణ మంటపంలో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరించాలని తీర్మానించారు. కార్యక్రమంలో మజ్జి కాంతారావు, చిట్టిబాబు, అప్పలనాయుడు, ఫణి, అప్పలరాజు, రేగి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే మహారాజా ఉన్నత పాఠశాలలో 1985 – 86 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు కొత్త అగ్రహారంలోని గోగుల రమేష్ స్వగృహంలో కలుసుకున్నారు. సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రంధి శంకరరావు , అప్పలనరసయ్య (కోటి) ఆర్‌జేబీ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ.. మానవత్వానికి ప్రతిరూపం



కేక్ కట్ చేసి మాతృమూర్తులను అభినందిస్తున్న సిస్టర్ సువర్ణ, రవికుమార్ తదితరులు

విజయనగరం టౌన్: మానవత్వానికి ప్రతిరూపం అమ్మ అని ఏసు ప్రేమాలయం చర్చి పాస్టర్ అలజంగి రవికుమార్ అన్నారు. సిస్టర్ సువర్ణ ఆధ్వర్యంలో చర్చి ఆవరణలో ఆదివారం మాతృ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ సువర్ణ మాట్లాడుతూ.. దేవుని సేవలో ఉన్న ప్రతి ఒక్కరూ అమ్మను గౌరవించాలని.. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను అక్కున చేర్చుకోవాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో చింతాడ సువార్తమ్మ, ఝాన్సీ సుజాన్ ఈశ్వరమ్మ, నరసయ్యమ్మ, లక్ష్మి, శ్రీదేవి, మేరీ రత్నం, అనూష, మౌడీ, లిక్కి, అలేఖ్య, దీవెన, తదితరులు పాల్గొన్నారు.

మాతృమూర్తి లేనిదే సమాజ మనుగడ లేదు..

విజయనగరం టౌన్: మాతృమూర్తి లేనిదే సమాజ మనుగడ లేదని బ్రహ్మకుమారీస్ జిల్లా ఇన్‌చార్జ్ బీకే అన్నపూర్ణ తెలిపారు. స్థానిక కంటోన్మెంట్‌లో ఉన్న బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సేవా కేంద్రంలో ఆదివారం రాత్రి మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక సందేశాన్ని ఆమె అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, వెంకటపద్మ ఆస్పత్రి వైద్యులు ఎం.పద్మ కుమారి, తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక సందేశాన్ని అందజేస్తున్న బీకే అన్నపూర్ణ

ఉచిత సీట్లపై ప్రచార లోపం..!

- విద్యా హక్కు చట్టం ప్రకారం పేదపిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు
- 2025-26 విద్యా సంవత్సరానికి తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం
- ఉచిత సీట్లపై అవగాహన కల్పించడంలో విద్యాశాఖ అలసత్వం
- మండల విద్యాశాఖ కార్యాలయాల్లో కానరాని హెల్ప్‌డెస్క్‌లు
- సచివాలయాల వద్ద కనిపించని ఫ్లెక్సీలు, పోస్టర్లు
- దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 15వ తేదీతో ముగియనున్న గడువు



మెరకముడిదాం మండల విద్యావనరుల కేంద్రం

మెరకముడిదాం: పేద పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలపై అవగాహన కల్పించడంలో క్షేత్రస్థాయిలో విద్యాశాఖ అలసత్వం వహిస్తోంది. విద్యాహక్కు చట్టం–2009 సెక్షన్ 12(1)సీ ప్రకారం ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం సీట్లను పేద పిల్లలకు ఉచితంగా కేటాయించాల్సి ఉంటుంది. కానీ ఎక్కడా ఈ విధానం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ప్రజల్లో అవగాహన లేకపోవడంతో పాటు విద్యాశాఖ ప్రచారం చేయకపోవడమే. ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు ఉచిత సీట్ల కేటాయింపు అనేది నీటిమీద రాతలా మిగిలిపోతోందన్న ఆరోపణలు విద్యావేత్తల నుంచి వినిపిస్తున్నాయి. ఉచిత సీట్లపై గ్రామ, మండల స్థాయిల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆ శాఖ జిల్లా, మండల అధికారులను ఆదేశించారు. ఈవిషయంపై పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలని, మండల విద్యాశాఖ కార్యాలయాల వద్ద ఫ్లెక్సీలు, గ్రామ సచివాలయాల వద్ద పోస్టర్లు తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న దగ్గర నుంచి అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు అవగాహన కల్పించడంతో పాటు పిల్లల తల్లిదండ్రుల సందేహాల నివృత్తికి, వారికి సహాయం, సూచనలు చేసేందుకు మండల స్థాయిలో హెల్ప్‌డెస్క్‌లు కూడా ఏర్పాటు చేయాలి. ఫేస్‌బుక్, ఎక్స్, యూట్యూబ్, లోకల్ మీడియాల్లో కానీ ప్రచారం చేయాలి. కానీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఇవేమీ చేయకపోవడంతో ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా సీటు ఇస్తారనే సంగతి తల్లిదండ్రులకు తెలియకపోవడంతో దరఖాస్తులు చేసుకోవడం లేదు.

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి...

2025– 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతిలో 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్‌ను బోధిస్తున్న అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలలకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొంది.

అర్హతలు..దరఖాస్తు చేసుకునే విధానం..

ఎస్సీ,ఎస్టీ, బీసీ,ఓసీ, మైనార్టీ, అనాథ పిల్లలు, హెచ్‌ఐవీ బాధిత, దివ్యాంగ పిల్లలు అర్హులు. 2019 ఏప్రిల్ 2 నుంచి 2020 మార్చి 31 మధ్య జన్మించి ఉండాలి. సీట్ల ఎంపికలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాల వారి పిల్లలు, అనాథ పిల్లలు, హెచ్‌ఐ వీ బాధిత పిల్లలు, దివ్యాంగులకు 5 శాతం, షెడ్యూల్ తెగలకు 4 శాతం, షెడ్యూల్ కులాలకు 10 శాతం, బలహీనవర్గాలకు (బీసీ,మైనార్టీ, ఓసీ)చెందిన పేదకుటుంబాల పిల్లలకు 6 శాతం సీట్లను కేటాయిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు లోపు, పట్టణ ప్రాంతాల్లో నివసించే వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.44 లక్షలలోపు ఉండాలి. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఏప్రిల్ 28వ తేదీన ప్రారంభం కాగా, ఈనెల15వ తేదీతో ముగియనుంది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ లేదా సమీపంలోని గ్రామ/వార్డు సచివాలయాలు, మండల విద్యాశాఖ కార్యాలయంలో కానీ దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులను మే 16వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు పరిశీలించి గ్రామ సచివాలయాల డేటా ఆధారంగా మ్యాపింగ్ చేసిన పాఠశాలలకు అర్హతలు నిర్ణయిస్తారు. మే 21 నుంచి 24 వరకు లాటరీ ద్వారా మొదటి దశలో సీట్లు కేటాయిస్తారు. వీరికి జూన్ 2వ తేదీ నుంచి ప్రవేశాలు కల్పిస్తారు. సీట్లు నిండకపోతే రెండో జాబితాను జూన్ 6వ తేదీన విడుదల చేస్తారు. వీరికి జూన్ 12 నుంచి అడ్మిషన్లు కల్పిస్తారు.